క్లుప్తంగా

విశ్రాంత తహసీల్దారు కృష్ణారావు మృతి



దుగ్గిరాల: విశ్రాంత తహసీల్దారు కొండముది కృష్ణారావు (72) శుక్రవారం ఉదయం మండలంలోని చిలువూరులో గల స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య నాగమణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భౌతికకాయాన్ని గ్రామస్తులు, సంఘ పెద్దలు, నాయకులు సందర్శించి సంతాపం తెలిపారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు

నిరుపేద కుటుంబం నుంచి వచ్చి ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగం పొంది పేద బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడిని కృష్ణారావు మృతి తీరని లోటని గ్రామ సర్పంచి చిలువూరు మాణిక్యం అన్నారు.

కౌలు రైతు సంఘం నాయకుడు అమ్మిరెడ్డి మృతి



దుగ్గిరాల: కౌలు రైతు సంఘం నాయకుడు భీమవరపు అమ్మిరెడ్డి (67) గురువారం దుగ్గిరాల మండలం పెనుమూలిలో మృతి చెందారు. అర్ధరాత్రి ఛాతీలో నొప్పిగా ఉందని కుప్పకూలిపోయారు. కుటుంబసభ్యులు హుటాహుటిన మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని ధ్రువీకరించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియలను శుక్రవారం పెనుమూలిలో నిర్వహించారు. భౌతికకాయాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, నేతలు సందర్శించి నివాళులర్పించారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు పలు ప్రయోజనాలు



దుగ్గిరాల: జీఎస్టీ తగ్గింపుతో రైతులకు పలు ప్రయోజనాలున్నాయని ఏఓ విజయబాబు తెలిపారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన ఉపకరణాలు, ట్రాక్టర్లు, పాల ఉత్పత్తులు, రసాయన ఎరువులు ధరలు తగ్గాయని పేర్కొన్నారు. మండలంలోని చిలువూరులో గ్రామస్తులకు, రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. పలు బజార్లలో ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలతో ర్యాలీ నిర్వహించారు. వినియోగదారుడా మేలుకో.. జీఎస్టీ ఫలాలు అందుకో అంటూ నినాదాలు చేశారు. ఒక ట్రాక్టరు కొనుగోలుపై గతంతో పోల్చితే రూ. 50 వేలు తగ్గిందని తెలిపారు. నిత్యావసరాలు, పాదరక్షలు, దుస్తులు, స్టేషనరీ, ఆహారానికి సంబంధించిన పలు వస్తువులపై ధరలు తగ్గాయని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మాణిక్యమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రోజానమ్మ, ఇంచార్జి ఎంపీడీఓ వి.చంద్ర మోహన్, డెప్యూటీ ఎంపీడీఓ కె.జె.నెల్రూ, వెటర్నరీ డాక్టరు సతీష్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

దుగ్గిరాల: బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం దుగ్గిరాలలో జరిగింది. మండలంలోని తుమ్మపూడికి చెందిన వై.అరవింద్ తెనాలి వెళుతుండగా దుగ్గిరాల సినిమా హాలు సమీపంలో పంది అడ్డు వచ్చింది. దాన్ని తప్పించబోయే క్రమంలో బైక్ అదుపు తప్పడంతో అరవింద్ రోడ్డుపై పడిపోయాడు. హెల్మెట్ లేకపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు కారులో తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు.

గాంధీజీ, శాస్త్రీజీ సేవలు ఆదర్శనీయం

ఘనంగా జయంతి వేడుకలు



మంగళగిరిలో నివాళులర్పిస్తున్న సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: మహాత్మా గాంధీ ఆశయాలను నెరవేర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పిలుపునిచ్చారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట గల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాలి వెంకటకృష్ణ, ఈపూరి ఆదామ్, సుంకర రఘుపతిరావు, ఫిరోజ్, సుబ్బారావు, కృష్ణ కిశోర్, మాబు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో..

దేశానికి స్వాతంత్ర్యం రావడంలో గాంధీజీ పాత్ర ప్రముఖమని ఫ్రెడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు.

మండల కేంద్రంలోని శివాలయం సెంటర్‌లో గల గాంధీ విగ్రహానికి, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి ఫ్రెడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. గాంధీజీ, శాస్త్రీజీ ఆదర్శాల అనుగుణంగా యువత నడవాలని కోరారు. కార్యక్రమంలో బాలరాజు, వెంకటేశ్వరరావు, గణేష్, హనమాన్, నాగయ్య, వెంకయ్య, పాములు, ఎల్లయ్య పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్‌లో..

జాతిపిత మహాత్మా గాంధీ, దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను తాడేపల్లి వైఎస్సార్ సీపీ పట్టణ, రూరల్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. తాడేపల్లి పట్టణ పరిధిలో జరిగిన కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిన నాయకుల్లో మహాత్మా గాంధీ అగ్రగణ్యుడని, సత్యం, అహింస మార్గాల ద్వారా స్వాతంత్ర్యం సాధ్యమని చెప్పిన వ్యక్తి అని కొనియాడారు. భారతదేశ రెండవ ప్రధానిగా లాల్ బహదూర్ సేవలు ప్రశంసనీయమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంచనపల్లిలో....

వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య, గ్రామ అధ్యక్షులు మిరియాల రాంబాబు ఆధ్వర్యంలో గురువారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుంచనపల్లిలోని గాంధీ, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల ప్రధాన కార్యదర్శి శివనాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు విజయేంద్ర, గ్రామ ఉపాధ్యక్షులు నల్లపు రవితేజ, తాడేపల్లి మండల రైట్ ఇన్ఫర్మేషన్ అధ్యక్షులు ప్రదీప్, కుంచనపల్లి వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కూరపాటి సాంబయ్య, తాతయ్య పాల్గొన్నారు.



దుగ్గిరాల శివాలయం సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున ఫ్రెడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



తాడేపల్లిలో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కుంచనపల్లిలో గాంధీ, రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు !



శిబిరంలో మాట్లాడుతున్న కూరపాటి స్టీవెన్

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానంద పురంలో శుక్రవారం కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన నాయకులు ఆదినారాయణ, సాంబశివరావు, నాగేశ్వరరావు, సుభానీలతో కలసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కార్మికులు రావాల్సిన బకాయిల కోసం 30 సంవత్సరాలకు పైగా ఎదురు చూస్తున్నారని, 304 రోజులుగా ఎండనక, వాననక దీక్షలు చేస్తున్నారని తెలిపారు.ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి సమస్యను పరిష్కరించడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్మికులు సాంబశివరావు, నాగేశ్వరరావు, ఇశ్రాయిల్, ఇమాంబి, శారమ్మ, రమాదేవి, రిబ్కా, శివకుమారి, అన్నమ్మ, గురవయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ చించివేత



మద్యం మత్తులో ఫ్లెక్సీని పడేస్తున్న టీడీపీ నాయకుడు

తాళ్లాయపాలెం(తాడికొండ): రాజధాని తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో తెలుగు తమ్ముళ్లు శుక్రవారం రెచ్చిపోయారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కిందపడేసి చింపివేశారు. తెరవెనుక ఉన్న పెద్ద నాయకులు మద్యం తాగించి వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీని చించమని ఇచ్చిన ఆదేశాల మేరకు ఓ నాయకుడు వచ్చి తూలుతూ మరీ ప్రజలు చూస్తుండగానే ఫ్లెక్సీని చీశాడు. విద్వేషాలను రెచ్చగొడుతున్న ఇలాంటి చర్యలను పోలీసులు అడ్డుకొని కారకులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాలకు మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు నిలిపి వేస్తున్నట్లు చెప్పారు.

దుగ్గిరాలలో..

విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కంఠంరాజు కొండూరు, చిలువూరు, మంచికలపూడి గ్రామాలకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ కె.గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంగళగిరి టౌన్‌లో..

పట్టణ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం నగర పరిధిలోని ఇందిరానగర్, ఎల్‌బీ నగర్, గణపతి నగర్, ఏపీఎస్పీ 6వ బెటాలియన్ ప్రాంతాల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ జి. సురేష్‌బాబు శుక్రవారం తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గుముఖం

ఫిరంగిపురం: జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుముఖం పడతాయని ఇంచార్జి ఎంపీడీవో కె.రవిబాబు తెలిపారు. ఫిరంగిపురంలోని పలు దుకాణాలు, వాహనాల షోరూంలను శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు తగ్గించిన ధరల్లోనే నిత్యావసర వస్తువులు ప్రజలకు అందిస్తున్నారా లేదా అని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఉన్న ధరలు, ప్రస్తుత ధరలు తనిఖీచేసి వివరాలు బోర్డుల్లో నమోదు చేయాలని వ్యాపారులకు సూచించారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, ఈవో ఏకే బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై కేసు

తెనాలి రూరల్: గాంధీ జయంతి రోజున అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. పట్టణంలో గురువారం ఇద్దరు వ్యక్తులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండడం ఎక్సైజ్ అధికారుల దృష్టికి వెళ్లింది. ఇద్దరు వ్యక్తులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్టు తెనాలి ఎక్సైజ్ సీఐ ఏపీ చలం తెలిపారు.

రాజధానిలో పెట్టుబడులకు మలేషియా కంపెనీల ఆసక్తి

సచివాలయంలో మంత్రి నారాయణతో సమావేశం

తాడికొండ: అమరావతిలో రాబోయే ఐదేళ్లలో రూ. 6 వేల నుంచి 10 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు మలేషియా కంపెనీలు ఆసక్తి కనబరిచాయని మంత్రి నారాయణ తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి మలేషియా బృందం అక్కడి మంత్రి, ఎంపీతో కలిసి అమరావతిలో పర్యటించింది. మంత్రి నారాయణ అమరావతి నిర్మాణ పనులు జరుగుతున్న తీరును వారికి వివరించారు. అనంతరం సచివాలయంలో వారితో సమావేశమయ్యారు. మలేషియాలోని సెలాంగార్ స్టేట్ ఎక్స్ కో మంత్రి పప్పారాయుడు, క్లాంగ్ ఎంపీ గనబతిరావ్ (మలేషియా), ఆంధ్రా బిజినెస్ చాంబర్ ప్రతినిధులు, పలు ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. మలేషియాలో తెలుగు మూలాలు ఉన్న పారిశ్రామికవేత్తలకు చెందిన పలు కంపెనీల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ ప్రాజెక్ట్‌ల గురించి మంత్రి నారాయణకు వివరించారు. ఎడ్యుకేషన్, టూరిజం – హాస్పిటాలిటీ, ట్రేడ్ అండ్ కామర్స్, రియల్ ఎస్టేట్, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు చెందిన వివిధ ప్రాజెక్ట్‌ల్లో పెట్టుబడులకు ఆసక్తి కనబరిచారు. అమరావతి అభివృద్ధికి భారత్‌తో కలిసి పనిచేస్తామని మలేషియా మంత్రి పప్పారాయుడు తెలిపారు. అమరావతిలో మెడికల్ యూనివర్సిటీ ఏర్పాటుకు మలేషియాలోని సైబర్ జయ యూనివర్సిటీ ముందుకొచ్చిందని, ఫైవ్ స్టార్ హోటల్స్ ఏర్పాటుకు బెర్జయ గ్రూప్ ముందుకొచ్చిందని మంత్రి నారాయణ తెలిపారు.

రాజరాజేశ్వరిగా అమ్మవారి దర్శనం



కంఠంరాజుకొండూరులో అమ్మవారు



సత్యహరిశ్చంద్ర నాటకంలో సన్నివేశం

దుగ్గిరాల: మండలంలోని కంఠంరాజుకొండూరులో గల శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో గురువారం విజయదశమి సందర్భంగా వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆఖరి రోజు భక్తులకు శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా దర్శనం ఇచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. లలితా సహస్ర నామ పారాయణం, సామూహిక కుంకుమార్చన, విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీర్వచనాలు తీసుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి కె. సునీల్ కుమార్ పర్యవేక్షించారు.

చినకాకానిలో వైభవంగా దసరా ఉత్సవాలు

చినకాకాని(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చినకాకానిలో దసరా మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సత్యహరిచ్చంద్ర నాటకం అలరించింది.

అంబేడ్కర్ విగ్రహానికి అవమానం దారుణం

కేవీపీఎస్ నాయకుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

మంగళగిరి టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) మంగళగిరి పట్టణ కార్యదర్శి వై. కమలాకర్ డిమాండ్ చేశారు. పాత మంగళగిరిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి, పార్టీలకు అతీతంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, జీవరత్నం, మురళి, విక్టర్ పాల్, భాస్కర్, దావీదు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్‌లో..

తాడేపల్లిలోని 1వ వార్డులోగల అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు అంటించడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కార్యదర్శి గాదె సుబ్బారెడ్డి, కేవీపీఎస్ నాయకులు పల్లె కృష్ణ, ఎన్. విజయరాజు, లక్ష్యయ్య, నీరుడు దుర్గారావు, సతీష్, రమేష్ పాల్గొన్నారు.

కేవీపీఎస్ జెండా ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: అణగారిన వర్గాల హక్కుల కోసం, కుల వివక్షకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక సంఘం కేవీపీఎస్ అని జిల్లా కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్ అన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ముగ్గు రోడ్డులో సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా నేటికీ వివిధ రూపాల్లో వివక్ష కొనసాగడం దారుణమని తెలిపారు. దళితులు, బహుజనులు తమకు రావాల్సిన నిధులు, విధులు, హక్కుల కోసం గళమెత్తాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు దర్శనపు విజయబాబు, వై. బర్నబాస్, కోట బాబూరావు, గాదె సుబ్బారెడ్డి, వై. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాడికొండలో వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

- ప్రారంభించిన మాజీ ఎంపీ మోదుగుల, ఇన్‌చార్జి డైమండ్ బాబు



కార్యాలయం ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ మోదుగుల, ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్)

తాడికొండ: చెడుపై మంచి గెలిచిన రోజైన విజయదశమి, బ్రిటిష్ దొరలను పారదోలిన గాంధీజీ స్ఫూర్తితో తాడికొండలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరేయడం ఖాయమని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల సమన్వయకర్త, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. గురువారం తాడికొండ అడ్డ రోడ్డులో పార్టీ మండల కార్యాలయాన్ని నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్)తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ దొరలను పారదోలిన గాంధీజీ స్ఫూర్తితో రాజధాని దొంగలను తరిమేయాలని పిలుపునిచ్చారు. కార్యాలయం ఏర్పాటు చేసిన పార్టీ మండల అధ్యక్షులు వంగా పోలారెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముప్పాళ్ల మనోహర్‌లను అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముప్పాళ్ల మనోహర్, తాడికొండ, తుళ్లూరు మండలాల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, మైనేని నాగమల్లేశ్వరరావు, జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షుడు దాసరి రాజు, రాష్ట్ర ఎస్సీ సెల్, పంచాయతీ రాజ్ విభాగం సంయుక్త కార్యదర్శులు బాకి వెంకటస్వామి, ఆరేపల్లి జోజి, రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకులు మస్తానవ్ వలి, చుండు వెంకటరెడ్డి, వివిధ విభాగాల నాయకులు మల్లంపాటి రాఘవరెడ్డి, ఆళ్ల హనుమంతరావు, షేక్ అజీస్, బొజ్జా శ్రీహరి, గుంటి రఘువరన్, దమ్మాటి మోహనరావు, బాబావలి, షేక్ బాజీ, శ్రీకాంత్, వలపర్ల కల్పన, మాదాసు రత్నకుమారి, కొప్పుల శేషగిరి రావు, ఐనవోలు సుధీర్, బెజ్జం రాంబాబు, నేలపాటి వినోద్, దానం వినోద్, కంతేటి అశోక్, షేక్ జాని, పుట్టి సుబ్బారావు, ఉడుముల పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

మంగళగిరి టౌన్ : మంగళగిరి నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు కోరారు. నగర పరిధిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సుమారు 22వేల మంది పేదలు వివిధ భూముల్లో ఇళ్లు వేసుకుని ఎన్నో సంవత్సరాలుగా నివాసముంటున్నారని తెలిపారు. వారిలో మూడు వేల మందికి మాత్రమే మంత్రి నారా లోకేష్ ఇటీవల పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మిగిలిన 19 వేల మందికి కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదలకు కూడా స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని, దాన్ని కూడా నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈనెల 6వ తేదీ నుంచి పట్టణంలోని అన్ని వార్డుల్లో పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు సమస్యలు తెలుసుకుని, వాటిని అర్జీల ద్వారా అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట ఈనెల 13,14,15 తేదీల్లో రిలే దీక్షలు చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై. కమలాకర్, పట్టణ కార్యదర్శి వి.వి. జవహర్‌లాల్, సీనియర్ నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్తా కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పిలుపునిచ్చారు. మండలంలోని నీరుకొండలో గురువారం టీడీపీ కార్యకర్తలు పార్టీ మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు

సీఆర్డీఏ జీఆర్ఎం నోడల్ అధికారిణి జయశ్రీ



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

తాడికొండ: రాజధాని ప్రాంత రైతుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ఏపీ సీఆర్డీఏ గ్రీవెన్స్ రెడ్రెస్ మేనేజ్‌మెంట్ (జీఆర్ఎం) నోడల్ అధికారిణి పి. జయశ్రీ తెలిపారు. రాజధాని ప్రాంత రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించేందుకు శుక్రవారం తుళ్లూరులోని ప్రాంతీయ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. పలువురు రైతులు, వ్యవసాయ కూలీలు పిటిషన్లను నోడల్ అధికారిణికి సమర్పించారు. త్వరితగతిన పరిష్కారం అందించేలా చర్యలు తీసుకుంటామని ఆమె భరోసా ఇచ్చారు. పలు ఫిర్యాదులను వెంటనే పరిష్కరించారు. మిగిలిన వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చూపవద్దని అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. శుక్రవారం గ్రీవెన్స్‌లో మొత్తం 25 ఫిర్యాదులు రాగా భూమికి సంబంధించి – 19, డెవలప్మెంట్ ప్రమోషన్ – 4, హ్యూమన్ రిసోర్సెస్ – 1, ఆఫీస్ మేనేజ్‌మెంట్ – 1 వచ్చినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో సీఆర్డీఏ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం. శేషిరెడ్డి, పి. పద్మావతి, బి. శ్రీనివాస నాయక్, జి. భీమారావు, కె.ఎస్. భాగ్యరేఖ, జోనల్ జాయింట్ డైరెక్టర్ (డెవలప్మెంట్ ప్రమోషన్) సీహెచ్. మధుసూదన్‌రావు, సంక్షేమ విభాగం డీసీడీఓ బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

7న విజయవాడలో ఫ్యాప్టో పోరుబాట



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

మంగళగిరి టౌన్: ఆర్థిక, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 7న విజయవాడలో జరిగే రాష్ట్ర ఫ్యాప్టో పోరుబాటను విజయవంతం చేయాలని జిల్లా చైర్మన్ కె. నరసింహారావు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని కేకే మున్సిపల్ హైస్కూల్‌లో మంగళగిరి ప్రాంతీయ ఫ్యాప్టో సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ న్యాయంగా రావాల్సిన ఆర్థిక అవసరాలను ప్రభుత్వం ఇంతవరకు తీర్చలేదని, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించలేదని తెలిపారు. తక్షణమే ఆర్థిక బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. మంగళగిరి మండల పరిధిలోని ఉపాధ్యాయులంతా ధర్నాలో పాల్గొనాలని కోరారు. అనంతరం ధర్నా పోస్టర్‌ను, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో డెప్యూటీ సెక్రటరీ జనరల్ రాజశేఖర్, సుబ్బారెడ్డి, ఖలీద్, ఏరియా కార్యదర్శి సాలార్ బేగ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సైదా నాయక్, మదన్ కుమార్, గోపీచంద్, జోజప్ప, అరుణ్‌కుమార్, ఏడుకొండలు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం

తెనాలి అర్బన్: రామలింగేశ్వరపేటలో వైఎస్సార్ సీపీ నాయకులు ధరణికోట మల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. అక్కడ ఏర్పాటు చేసిన అన్నదానాన్ని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, కుర్రా సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.